రూ. 67.50 లక్షలతో అభివృద్ధి పనులు



విహారి హోమ్స్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలో రూ. 67.50 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, యంనంపేట్, అన్నోజిగూడ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... ఇస్మాయిల్‌ఖాన్‌గూడలోని విహారి కాలనీలో సీసీ రోడ్డు కోసం రూ. 22.50 లక్షలు, యంనంపేట్‌లోని సాయితేజ కాలనీలో డ్రైనేజీ నిర్మాణం కోసం రూ. 15 లక్షలు, అన్నోజిగూడలోని ఎన్టీపీసీ చౌరస్తా నుంచి రాజీవ్ గృహకల్ప వరకు బీటీ నిర్మించేందుకు రూ. 30 లక్షలు మున్సిపల్ సాధారణ నిధుల నుంచి కేటాయించామన్నారు. అన్ని వార్డులలో దశల వారీగా మౌలిక వసతులను మరింత పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, కౌన్సిలర్లు గొంగ్ల మహేష్, నర్రి ధనలక్ష్మి కాశయ్య, సింగిరెడ్డి సాయిరెడ్డి, సుర్వి రవీందర్, ఏఈ మహిపాల్, నాయకులు నల్లవెల్లి శేఖర్, ఐలయ్య, కె.ఎం.రెడ్డి, జితేందర్ నాయక్, గొంగ్ల బాలేష్, ప్రభాకర్, ఉపేందర్, నర్సయ్య, బొక్కా బుచ్చిరెడ్డి, పి.శేఖర్‌గౌడ్, రాజు, రమేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రుల్లో ఎవరికీ ఇబ్బంది కల్గించొద్దు

మేడ్చల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ



మేడ్చల్: గణేష్ నవరాత్రుల పేరిట ఇతరులెవరికీ ఎలాంటి ఇబ్బందులకు గురిచేసే పనులను గణేష్ మండపాల నిర్వాహకులు చేయవద్దని మేడ్చల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ స్పష్టం చేశారు. మేడ్చల్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ... కాలనీలు, గ్రామాలలో భక్తులు భక్తి శ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలే గానీ ఇతరులకు ఇబ్బందులు కలించరాదన్నారు. మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 328 ప్రాంతాలలో వినాయక ప్రతిమలు ప్రతిష్ఠిస్తారని తెలిపారు. కాలనీలు, గ్రామాలలో ప్రధాన రోడ్లపై వినాయక మండపాలను ఏర్పాటు చేసి ఇళ్లకు వెళ్లే దారులను మూసివేస్తున్నారే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. మండపాల ఏర్పాటు సమయంలో దారులను ఎట్టి పరిస్థితిల్లో మూయవద్దని అన్నారు. వాహనాల రాకపోకలు సాగే విధంగా మండపాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిమజ్జనం తేదీని పోలీసులకు తెలియజేయాలని రాత్రి సమయాల్లో మండపాల వద్ద నిర్వాహకులు తప్పక ఉండేలా చూసుకోవాలని అన్నారు. ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన వైరింగ్‌తో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని అన్నారు. సంఘ వ్యతిరేక శక్తులు సృష్టించే వదంతులు నమ్మి వివాదాల జోలికి వెళ్ల వద్దని ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సూచించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

మేడ్చల్: వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉంటూ తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అవగాహన కల్పిస్తూ మేడ్చల్ ఆర్టీసీ డిపోలో కళాకారులు కళాజాత కార్యక్రమం నిర్వహించారు. సీజన్‌లో వ్యాధులు ఎలా సోకుతాయి, సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటివి వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎన్విరాల్‌మెంట్ ఏఈ జ్ఞానేశ్వర్ రెడ్డి కళాకారులు కిషోర్, బాలు, రేణుక జ్యోతి, శోభ తదితరులు పాల్గొన్నారు.

నాగారంలో ఓటరు సర్వేను త్వరగా పూర్తిచేయండి

కీసర: నాగారం మున్సిపాలిటీలో డోర్ టూ డోర్ ఓటరు సర్వేను త్వరగా పూర్తిచేయాలని బీఎల్‌ఓ (బూత్ లెవల్ ఆఫీసర్)లను నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీఎల్‌ఓలు తమకు కేటాయించిన వార్డుల్లో నిర్దేశించిన సమయానికి ముందుగానే డోర్ టూ డోర్ ఓటరు సేర్వే పూర్తి చేయాలన్నారు.

మల్లారెడ్డి యూనివర్సిటీలో సందడిగా 'ఐటీ ఫెస్టెంబర్'



కార్యక్రమంలో పాల్గొన్న యూనివర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డి

మేడ్చల్‌రూరల్: మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో శుక్రవారం ఐటీ ఫెస్టెంబర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ వి.ఎస్.కె.రెడ్డి పాల్గొని విద్యార్థి క్లబ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టెక్నికల్ క్లబ్‌లు, ప్రాజెక్టులతో విద్యార్థులు తమ పరిజ్ఞానాన్ని పెంచుకోవచ్చన్నారు. కల్చరల్ క్లబ్‌లో క్రియేటివ్ ఐడియాలు, సోషల్ మీడియా ఇంటరాక్షన్ ఎక్కువగా ఉంటుందని దీంతో వ్యక్తిగతంగా, ప్రొఫెషనల్‌గా అభివృద్ధి చెందవచ్చని వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అంజనేయులు, డీన్ హరికృష్ణ, మేరవలి, నవీన్ కుమార్, హెచ్‌ఓడీ రాజశరత్‌కుమార్, ఆనంద్ వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

వినాయక చవితికి సర్వం సిద్ధం

[illegible] ఆనందంగా వైభవంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా మేడ్చల్ పట్టణంలో కాలనీలు, బస్తీల్లో గణనాథుల ప్రతిష్ఠాపనకు మండపాలు ఏర్పాటు చేశారు. ఆయా మండపా [illegible] ఏర్పాట్లు చేశారు.

మార్కెట్‌లో సందడే సందడి...

[illegible] తీసుకెళ్లారు. – మేడ్చల్

– మేడ్చల్



వినాయక విగ్రహాలను తరలిస్తున్న దృశ్యం



విగ్రహాలను కొనుగోలు చేస్తున్న భక్తులు





పూజా సామగ్రి కొనుగోలుదారులతో రద్దీగా మార్కెట్

రైల్వే ఉద్యోగుల సంబరాలు



మేడ్చల్: పెన్షన్ విధానం ఎంపీఎస్ నుంచి యూపీఎస్ విధానానికి మారిన నేపథ్యంలో మేడ్చల్ రైల్వే స్టేషన్‌లో రైల్వే ఉద్యోగులు సంబరాలు చేసుకున్నారు. యూనియన్ నాయకుడు రాఘవయ్య చిత్రపటానికి పాలాభిషేకం చేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. నూతన పెన్షన్ విధానాన్ని సాధించేందుకు రాఘవయ్య చేసిన పోరాటాన్ని కొనియాడారు. ఉద్యోగులు అశోక్, గిరి, తులసి పాల్గొన్నారు.

మంద కృష్ణ మాదిగతో భేటీ



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి సుతారిగూడ గ్రామ ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా శుక్రవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను కలిసి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఎమ్మార్పీఎస్ యువసేన అధ్యక్షుడు పరుశురాం, జిల్లా కార్యదర్శి బాలనర్సింహ, గ్రామ అధ్యక్షుడు సాయిలు, నాయకులు పద్మారావు, సత్యనారాయణ, సూరిబాబు, గణేశ్, లక్ష్మణ్, నవీన్, నరేశ్ పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లి పాత చెరువు వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆ పనులను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, కమిషనర్ రాజేంద్రకుమార్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పురపాలక సంఘం ఆధ్వర్యంలో చెరువు వద్ద పటిష్ట ఏర్పాట్లు చేశామన్నారు. విద్యుత్ దీపాలు, శానిటేషన్ పనులు చేపట్టేందుకు మున్సిపల్ సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. పోలీస్, వివిధ శాఖల సిబ్బందితో కలిసి వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. కౌన్సిలర్ నాగేష్‌గౌడ్, కో ఆప్షన్ సభ్యుడు అశోక్‌గౌడ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



హ్యాకథాన్‌లో పాల్గొన్న అనిల్‌కుమార్, అరుణ్‌కుమార్

ఘట్‌కేసర్: విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎడ్‌టెక్స్ ఫౌండర్, సీఈఓ అనిల్‌కుమార్ విశ్వనాథులు అన్నారు. శుక్రవారం చౌదరిగూడ నల్లా నర్సింహారెడ్డి కళాశాలలో నిర్వహించిన ఇంటర్నేషనల్ హ్యాకథాన్-2024కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమస్యలను పరిష్కరించే ఆవిష్కరణలు సమాజానికి అందించాలని, వ్యక్తిగత నైపుణ్యంతో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. హ్యాకథాన్‌లో ఒక్కో టీంలో ఆరుగురు సభ్యులున్న మొత్తం 55 టీంలు పాల్గొన్నాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సి.వి.కృష్ణారెడ్డి, గౌరవ అతిథి ఎడ్‌టెక్స్ కో ఫౌండర్ అరుణ్‌కుమార్, హెచ్‌ఓడీ రామేశ్వరయ్య, ఇంజినీరింగ్ డీన్ జనార్దన్ రాజు, టీపీఓ శ్రీకాంత్, ఎస్పీఓసీ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ధనలక్ష్మి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని నాచారం కాలనీ అంగన్‌వాడీ కేంద్రం వద్ద శుక్రవారం పోషణమాసం సందర్భంగా పోషకాహారంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్‌నగర్ సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ధనలక్ష్మీ మాట్లాడుతూ... ప్రతి బిడ్డకూ సరైన పోషణ అందితేనే ఆరోగ్య తెలంగాణ సాధ్యమన్నారు. ప్రతి తల్లికి బిడ్డ పెరుగుదలపై అవగాహన ఉండాలన్నారు. అంగన్‌వాడీ టీచర్ అనసూయ, హెల్పర్ మంజుల, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

9న మేడ్చల్‌లో జాబ్‌మేళా

మేడ్చల్: మేడ్చల్‌లోని ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 9 తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ హనుమ నాయక్ తెలిపారు. ప్రముఖ కంపెనీల ప్రతినిధులు జాబ్‌మేళాకు హాజరై తమకు కావాల్సిన ఉద్యోగాలకు అర్హులను ఎంపిక చేస్తారని తెలిపారు. ఔత్సాహిక, అర్హత ఉన్న నిరుద్యోగులు మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించండి

కీసర: నాగారం మున్సిపాలిటీకి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించాలని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి కోరారు. ఈ మేరకు సీడీఎంఏ డైరెక్టర్ గౌతమ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ విషయంపై డైరెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు చైర్మన్ చంద్రారెడ్డి తెలిపారు. కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ పరిరక్షణకు తమవంతు కృషి చేయాలి

బోడుప్పల్: సమాజ పరిరక్షణకు తమవంతు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని హైదరాబాద్ సైబర్‌క్రైమ్ బ్యూరో, ఐపీఎస్ ఆఫీసర్ హర్షవర్ధన్ అన్నారు. బోడుప్పల్‌లోని కిరణ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన 'ఇన్‌స్పైర్ ఇంపాక్ట్' అనే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు తమ ఆశయసాధనకు అంకితభావం, పట్టుదలతో కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ నైతిక విలువలతో కూడిన నిబద్ధత కలిగిన నడవడి కలిగి ఉండాలన్నారు. ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను సులభమైన పద్ధతిలో అందరికీ అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. పాఠశాల వ్యవస్థాపకులు రితేష్, ప్రిన్సిపాల్ కస్తూరిరెడ్డి, 9,10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనోత్సవానికి నోడల్ అధికారులు

- ప్రశాంతంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత మీదే...
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

సాక్షి, సిటీబ్యూరో: గణేష్ నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకొని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 17 చెరువులలో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 17వ తేదీన గణేష్ నిమజ్జనోత్సవాన్ని అంగరంగ వైభవంగా.. పటిష్ట భద్రత నడుమ నిర్వహించనున్నామని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. నిమజ్జనోత్సవాన్ని నిర్వహించే ఆయా చెరువుల వద్ద జిల్లా యంత్రాంగానికి అనుసంధానంగా ప్రత్యేక అధికారులను నియమించామని కలెక్టర్ వెల్లడించారు. నోడల్ అధికారులు తమ పరిధిలోని వినాయక మండపాల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పండగ మూడో రోజు నుంచే వినాయకుల నిమజ్జన కార్యక్రమం మొదలవుతుందని, ప్రతి ట్యాంక్‌కు నియమించిన ప్రత్యేక అధికారులు ఈ విషయంలో తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత శాఖలు సమన్వయంతో గణేష్ విగ్రహాల నిమజ్జనాన్ని శాంతియుతంగా, సాఫీగా పూర్తి చేసేలా చూడాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు తమ పరిధిలోని చెరువులే కాకుండా ఇతర కుంటలు, చెరువులను పర్యవేక్షించటంతోపాటు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలన్నారు.

జిల్లాలోని చెరువులు, కుంటల వద్ద విధుల్లో నియమించిన ప్రత్యేక అధికారులు

- మేడ్చల్ సుతారి చెరువు, వసంతలక్ష్మి (ఎంపీడీఓ), ఫోన్: 98499 03330
- మేడ్చల్ పెద్ద చెరువు, నాగిరెడ్డి (మున్సిపల్ కమిషనర్), ఫోన్: 70328 98999
- బాచుపల్లి ప్రగతి నగర్ ట్యాంక్, సౌజన్య (ఎంపీ నిజాంపేట్), ఫోన్: 77290 03999
- ఉప్పల్ నల్ల చెరువు, ఆంజనేయులు (డిప్యూటీ కమిషనర్), ఫోన్: 80081 03667
- కుత్బుల్లాపూర్ వెన్నెలగడ్డ చెరువు, నర్సింహ (కమిషనర్), ఫోన్: 99899 30159
- కుత్బుల్లాపూర్ పరికి చెరువు, ఎల్.పి.మల్లయ్య (డిప్యూటీ కమిషనర్ గాజులరామారం), ఫోన్: 63095 29286
- కూకట్‌పల్లి ఐడీఎల్ ట్యాంక్, శ్యామ్ ప్రకాష్ (ఆర్‌డీఓ), మల్కాజిగిరి డివిజన్, ఫోన్: 79950 73753
- బాలానగర్ హస్మత్‌పేట్ బోవెన్ చెరువు, కృష్ణయ్య (డిప్యూటీ కమిషనర్), ఫోన్: 73375 57245
- కూకట్‌పల్లి సున్నం చెరువు, స్వామి (తహసీల్దార్), ఫోన్: 79950 73755
- శామీర్‌పేట సరస్సు, మమతా బాయి (ఎంపీడీఓ), ఫోన్: 98499 03332
- సఫిల్‌గూడ ట్యాంక్, రాజు (మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్), ఫోన్స్: 73311 89762, 91548 99636
- అల్వాల్ కొత్త చెరువు, శ్రీనివాస్‌రెడ్డి (డిప్యూటీ కమిషనర్), ఫోన్: 89854 09173
- సూరారం చెరువు (లింగం), రెహమాన్‌ఖాన్ (తహసీల్దార్ కుత్బుల్లాపూర్), ఫోన్ 79950 73757
- ఎదులాబాద్ ట్యాంక్, షబ్బీర్‌అలీ (ఘట్‌కేసర్ ఎంపీ), ఫోన్స్: 91540 83769, 91548 12771
- కాప్రా చెరువు, ముకుంద్‌రెడ్డి (డిప్యూటీ కమిషనర్), ఫోన్: 90001 13021
- రాంపల్లి చెరువు, రాజేంద్రకుమార్ (నాగారం ఎంపీ), ఫోన్: 70755 96119
- చెర్లపల్లి చెరువు, సుచరిత (తహసీల్దార్, కాప్రా), ఫోన్: 79950 73748

మండపాల వద్ద అప్రమత్తంగా ఉండండి...

సాక్షి, సిటీబ్యూరో: వినాయక మండపాల వద్ద కరెంట్, లైటింగ్ వంటి వైర్ల వద్ద జాగ్రత్తగా ఉంటూ ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ప్రజలకు సూచించారు. వినాయక చవితి పండగను పురస్కరించుకుని జిల్లా ప్రజలకు కలెక్టరు గౌతం వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. పండుగను భక్తి శ్రద్ధలతో ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

మట్టి గణపతి విగ్రహాల పంపిణీ



కీసర: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాలను పూజించాలని దమ్మాయిగూడ మున్సిపల్ 12వ వార్డు కౌన్సిలర్ పాండాల అనురాధ యాదగిరిగౌడ్ అన్నారు. శుక్రవారం దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని 12వ వార్డులో శుక్రవారం మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. శ్రీ భావనారుషి వెల్ఫేర్ అసోషియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఏముల దీప ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ జరిగింది.

సంస్కృతి టౌన్‌షిప్ పరిధిలో...



ప్రతిమలను అందజేస్తున్న కౌన్సిలర్ హరిప్రసాదరావు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో మట్టి వినాయక ప్రతిమలను కౌన్సిలర్ బి.హరిప్రసాదరావు శుక్రవారం పంపిణీ చేశారు. హెచ్ఎండీఓ సౌజన్యంతో సుమారు 500 ప్రతిమలను కాలనీవాసులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పర్యావరణాన్ని కలుషితం చేయకుండా మట్టి ప్రతిమలనే వినియోగించి వినాయక చవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో టౌన్‌షిప్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం



కీసర: నాగారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ శుక్రవారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ప్రారంభించారు. కమిషనర్ రాజేంద్రకుమార్, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు బిజ్జ శ్రీనివాస్ గౌడ్, గూడరు సబిత ఆంజనేయులుగౌడ్, కో ఆప్షన్ సభ్యులు, ఎంఈపీఎంఏ సిబ్బంది పాల్గొన్నారు.

మట్టితో గణేష్ విగ్రహాల తయారీ పోటీలు



మట్టి వినాయక విగ్రహాలతో అధ్యాపకులు, విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌సీఈ కళాశాలలో శుక్రవారం ఇకో ఫ్రెండ్లీ గణేశ్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మట్టితో వినాయక ప్రతిమల తయారీ పోటీలను నిర్వహించారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మట్టి, పిండితో వినాయక ప్రతిమలను అద్భుతంగా తీర్చిదిద్దారు. ఉత్తమంగా తీర్చిదిద్దిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, హెచ్‌ఓడీ సంపత్‌కుమార్, కో ఆర్డినేటర్లు దివ్య జ్యోతి, నేహాసుల్తానా, రాజేశ్వరి బహుమతులు అందజేశారు.